సాక్షి
జోగులాంబ గద్వాల
ఆదివారం । 24 । మార్చి । 2024

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-33 (ఆదివారం సాయంత్రం)
సహర్ 4-55 (సోమవారం తెల్లవారుజామున)




..ప్రాణం తీశారు
అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యానికి మరో బాలింత బలైంది.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 40.8 /21.5
ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.



ఈ చిత్రంలో ట్యాంకర్‌తో పంటకు నీళ్లు పడుతున్న ఈ రైతు పేరు మద్దూర్ ఉషనప్ప. నారాయణపేట జిల్లా దామరగిద్దకు చెందిన ఈ రైతుకు రెండు ఎకరాల పొలం ఉండగా.. మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. మొదట్లో బోర్లు బాగానే పోయడంతో రెండు బోర్ల కింద వరి సాగు చేశాడు. ఎండలు బాగా పెరగడంతో.. బోర్లలో నీళ్లు ఇంకిపోయాయి. రెండు బోర్లు కలిపి ఎకరా పొలం తడవడం లేదు. మిగిలిన మూడు ఎకరాలు కాపాడుకునేందుకు ఐదు కిలోమీటర్ల దూరం నుంచి ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా నీటిని తరలించి వరి మడులను తడుపుతున్నాడు. గింజ పడుతున్న సమయంలో నీళ్లందకపోవడంతో ఎలాగైనా పంటను కాపాడుకోవాలని ఒక్కో ట్యాంకర్ నీటికి రూ.1,500 చెల్లించి.. రోజుకు 20 ట్యాంకర్ల నీటిని అందిస్తున్నాడు. 'ఇప్పటికే ఎకరాకి రూ.20 వేల పెట్టుబడి పెట్టాడు. ఇప్పుడు అదనంగా సాగునీటి కోసం వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తుంది. అయినా పంట చేతికందే వరకు భరోసా లేదు.' అని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఎండాకాలం సాగు, ఎండు దశలో ఉన్న పంటల వివరాలు.. (ఎకరాల్లో..)



■ (భూగర్భ జలాలు అడుగంటిపోవడం, బోర్లు వట్టిపోవడంతో నీరందక ఇప్పటివరకు సుమారు 88,752 ఎకరాల్లో వరి.. 2,605 ఎకరాల్లో వేరుశనగ, మొక్కజొన్న పంటలు ఎండినట్లు అంచనా.)

ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల పరిధిలో సుమారు పదేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురిశాయి. అన్ని జిల్లాల్లో ఏటేటా సాగు విస్తీర్ణం పెరుగుతూ వచ్చింది. వర్షాకాలం (ఖరీఫ్)లో అంతటా పూర్తిస్థాయిలో పంటలు సాగు చేశారు. ఎండాకాలం (యాసంగి)లో సైతం సాగు విస్తీర్ణం

కరువుఛాయలు..

పెరుగుతూ రాగా.. ఆరుతడి పంటలకు బదులు వరి వైపు రైతులు మొగ్గు చూపుతూ వచ్చారు. ఈ క్రమంలో ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ.. ఖరీఫ్‌లో నీటి సమస్య ఎదురుకాలేదు. కానీ ఈ యాసంగిలో మార్చిలోనే ఎండలు ప్రతాపం చూపిస్తుండడం.. భూగర్భ జలాలు ఎన్నడూ లేనంతగా అధఃపాతాళానికి పడిపోతుండడంతో సాగు నీటి సమస్య తీవ్రమైంది. ముందస్తుగానే రైతులు వర్షాభావ పరిస్థితులను అంచనా వేసుకుని.. ఈ యాసంగిలో గత సీజన్ కంటే తక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. అంచనా తప్పడంతో రైతులు ప్రస్తుతం సాగునీటి కోసం తండ్లాడుతున్నారు. ఫలితంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కరువుఛాయలు అలుముకున్నట్లు ప్రస్తుత పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి.

అప్పులపాలు..

చివరి దశలో వరికి సాగు నీరందిస్తే పంటలను కాపాడుకోవచ్చే ఉద్దేశంతో చాలా మంది రైతులు బోర్ల వైపు మొగ్గుచూపుతున్నారు. రూ.లక్షలు ఖర్చు అవుతున్నా.. పంటలు కాపాడుకునేందుకు అప్పులు చేసి బోర్లు వేయిస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో 400 ఫీట్లకు పైగా బోర్లు వేసినా.. నీరు పడని పరిస్థితి ఉంది.

నీళ్లు లేక నెర్రెలు

అడుగంటిన భూగర్భ జలాలు.. ఎండుతున్న పంటలు

గ్రౌండ్ రిపోర్ట్

వర్షాభావ పరిస్థితులకు తోడు భానుడి భగభగలతో ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా భూగర్భ జలాలు అడుగంటాయి. నీటిమట్టాలు గణనీయంగా పడిపోగా.. బోర్లు, బావులు వట్టిపోయాయి. ప్రధానంగా చేతికొచ్చే దశలో వరి ఎండిపోతుండడంతో అన్నదాతలు నీటి కోసం భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని చోట్ల కిరాయి వెచ్చించి ట్యాంకర్లతో తడులు అందిస్తుండగా.. పలు ప్రాంతాల్లో వాగులు, చెరువుల నుంచి కిలోమీటర్ల కొద్దీ పైపులు వేసి నీరు పారిస్తున్నారు. కొందరు వ్యయప్రయాసల కోర్చి బోర్లు తవ్విస్తున్నా.. చుక్క నీరు పడని పరిస్థితి ఉంది. దీంతో చేసేదేమీ లేక సాగు చేసిన పంటను పశువులు, గొర్రెలకు మేతగా వదిలేస్తున్నారు. పెట్టుబడి ఖర్చులు పోను పంటలను కాపాడుకునేందుకు చేసిన అప్పులు పెనుభారంగా మారడంతో వారు విలవిల్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతుల జల ఘోష.. ఆర్థిక ఇబ్బందులపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

- వట్టిపోతున్న బోర్లు.. కాల్వల ద్వారా పారని నీరు
- పశువులు, గొర్రెలకు మేతగా మారిన పొలాలు
- పంటలను కాపాడుకునేందుకు అన్నదాతల తంటాలు
- రూ.లక్షలు వెచ్చించి బోరుబావులు తవ్వినా ఫలితం శూన్యం
- పెరిగిన ఖర్చులతో అప్పుల బారిన అన్నదాతలు



ఇది వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం చెన్నూరు శివారులో రైతు శేషురెడ్డికి చెందిన పొలం. మొత్తం 12 ఎకరాలలో వరిపంటను సాగు చేశాడు. నాలుగు బోర్లు వట్టిపోవడంతో ఐదు ఎకరాల పంట పూర్తిగా ఎండిపోయింది. మిగతా పంట చేతికి వచ్చే పరిస్థితి లేదు. ఎండిన పంటను ఇలా పశువుల మేతకు వదిలేశారు.

■ 91,357 ఎకరాల్లో ఎండిన పంటలు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎండాకాలం (యాసంగి) సీజన్‌లో ప్రధానంగా వరి, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న తదితర పంటలు సాగు చేశారు. మొత్తం 8,04,641 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వరి 5,34,150 ఎకరాల్లో సాగైనట్లు అధికారిక రికార్డులు చెబుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటిపోవడం, బోర్లు వట్టిపోవడంతో నీరందక ఇప్పటి వరకు సుమారు 88,752 ఎకరాల్లో వరి.. 2,605 ఎకరాల్లో వేరుశనగ, మొక్కజొన్న.. మొత్తం 91,357 ఎకరాల్లో పంటలు ఎండినట్లు వ్యవసాయ శాఖ వర్గాలు అనధికారికంగా అంచనా వేసినట్లు తెలుస్తోంది.

జిల్లాల వారీగా తగ్గిన నీటిమట్టాలు (సగటు మీటర్లలో..)..

జిల్లా	ఫిబ్రవరి-23	ఫిబ్రవరి-24	తేడా
మహబూబ్‌నగర్	7.43	10.19	- 2.76
వనపర్తి	4.80	7.30	- 2.50
జోగులాంబ గద్వాల	5.34	6.36	- 1.02
నాగర్‌కర్నూల్	6.57	9.55	- 2.98
నారాయణపేట	5.76	8.44	- 2.68

అన్నదాత.. జలఘోష
- వివరాలు 8లో..

న్యూస్‌రీల్

వేరుశనగ క్వింటా రూ.7,041



గద్వాల వ్యవసాయం: స్థానిక మార్కెట్ యార్డుకు శనివారం 762 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ. 7041, కనిష్టం రూ. 3289, సరాసరి రూ. 5700 ధరలు పలికాయి. అలాగే, 249 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్టం రూ. 5725, కనిష్టం రూ. 2001, సరాసరి రూ. 5715 ధరలు వచ్చాయి. 28 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం రూ. 9319, కనిష్టం రూ. 7266, సరాసరి రూ. 9226 ధరలు పలికాయి. 24 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ.2216, కనిష్టం రూ. 1859, సరాసరి ధర రూ. 2216 ధరలు వచ్చాయి.

పేదల సంక్షేమమే మోదీ లక్ష్యం



రాజోళి: పేదల సంక్షేమమే మోదీ లక్ష్యమని.. ప్రతిఒక్కరూ కడుపు నిండా అన్నం తినాలనే ఆలోచన చేసే ఏకైక నాయకుడు అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తుమ్మిళ్ల, చిన్న దన్వాడ,పెద్ద దన్వాడ,పెద్ద తాండ్రపాడు, పచ్చర్ల తదిదర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కరోనా సమయంలో ఉచితంగా బియ్యం అందించి ప్రతి పేద కుటుంబానికి అన్నం పెట్టాడని, మేకిన్ ఇండియా పేరుతో దేశంలో 43,275 హైవేలు నిర్మించారని, పీఎం కిసాన్ యోజన్ ద్వారా రైతులకు ఆర్థిక సహాయం అందించి వ్యవసాయానికి పెద్ద పీట వేశారని అన్నారు. మహిళలకు చేయూతనిస్తూనే, డిజిటల్ రంగంలో చైతన్యం తీసుకువచ్చిన ఘనత ఆయదేనని అన్నారు. 5వ ఆర్థిక వ్యవస్థగా దేశాన్ని రూపుదిద్దిన మోదీకి రానున్న ఎన్నికల్లో ప్రజలు మళ్లీ పట్టం కడతారని అన్నారు.నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో పోటీచేస్తున్న పోతుగంటి భరత్‌కు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంజీవ రెడ్డి, బల్లెర శివా రెడ్డి, శశి కుమార్, ఈసీ అంజనేయులు, కొంకతి రాము, గోవిందు రాజులు, ప్రదీప్ కుమార్ తదిదరులు పాల్గొన్నారు.

లక్ష్యం చేరేనా..?

ఆస్తిపన్ను చెల్లింపునకు మిగిలింది 8 రోజులే..

- జిల్లాలో ముమ్మరంగా ఆస్తిపన్ను వసూళ్లు
- వడ్డేపల్లి, అయిజ మున్సిపాలిటీలు వసూళ్లలో ముందంజ
- చివరి స్థానంలో గద్వాల మున్సిపాలిటీ



కమిషనర్‌కు ఆస్తిపన్ను చెల్లిస్తున్న ప్రజలు

అయిజ: జిల్లాలో ఆస్తిపన్ను వసూళ్లు మందగించాయి. ఈఆర్థిక సంవత్సరం అనేక కారణాలతో ఆశించిన మేరకు ఆస్తిపన్ను వసూలు కాలేదు. ఈ ఆర్థిక సంవత్సరం ఈ నెల 31తో ముగియనుంది. దీంతో వంద శాతం ఆస్తిపన్ను వసూలు చేసేందుకు ఇంకా 8 రోజుల సమయం మాత్రమే మిగిలింది. గత బుధవారం నాటికి జిల్లాలోని మున్సిపాలిటీల్లో గరిష్టంగా వడ్డెపల్లి మున్సిపాలిటీ 89 శాతం, కనిష్టంగా గద్వాల మున్సిపాలిటీ 55 శాతం పన్ను వసూళ్లు చేశాయి. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు టాప్ టెన్‌లో వడ్డెపల్లి మున్సిపాలిటీ 5 స్థానంలో ఉండగా అయిజ మున్సిపలిటీ 8 స్థానంలో ఉంది.

పన్నులతోనే ప్రగతి పరుగులు

ఆస్తి పన్ను ఆదాయంపైనే మున్సిపాలిటీల నిర్వహణ ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల, ఉద్యోగుల వేతనాలు ఆస్తిపన్ను పై ఆధారపడి చెల్లించాల్సి ఉంటుంది. నీటి సరఫరా, వీధి దీపాలు, కార్యాలయ నిర్వహణ, వాహనాల డీజిల్ ఖర్చు, వాటి మరమత్తుల ఖర్చు, విద్యుత్ బిల్లుల చెల్లింపు, పైప్‌లైన్ లీకేజీ నిర్వహణ, బ్లీచింగ్, సున్నం, క్రిమి సంహారక మందులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా పారిశుద్ధ్య కార్మికులకు కావల్సిన పరికరాలు, మోటార్ల కొనుగోలు, రోడ్లు, డ్రైనేజీల నిర్వహణ, హరితహారంకు బడ్జెట్‌లో 10 శాతం ఖర్చు, పండుగల నిర్వహణ, లైబ్రెరీ సెస్ తదితర ఖర్చులు ఉంటాయి. మొత్తంగా వంద శాతం పన్ను వసూలు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉన్నతాధికారులు ఆయా మున్సిపల్ అధికారులకు సూచిస్తున్నారు.

వడ్డీ రాయితీపై అవగాహన..



ఆస్తిపన్ను బకాయిలపై విధించిన వడ్డీపై ప్రభుత్వం 90 శాతం రాయితీ కల్పించింది. ఇంటింటికి తిరిగి వడ్డీ రాయితీ గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తే నూరు శాతం పన్ను వసూలయ్యేందుకు అవకాశం ఉంటుంది.

– మురళీకృష్ణ, అయిజ

విడతల వారీగా వసూలు చేయాలి..



వర్షాభావ పరిస్థితులతో పంటలు పండలేదు. దీంతో వ్యాపారాలు కూడా దెబ్బతిన్నాయి. ఒక్కో ఇంటికి రూ.వేలలో బకాయి పేరుకుపోయింది. ఆదాయం లేకపోవడంతో ఆస్తిపన్ను చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్నారు. బకాయిలపై విధించే వడ్డీలో 90 శాతం రాయితీ ప్రజలకు కొంత ఊరటనిచ్చింది. ఈఅవకాశం మరికొంత కాలం పొడగిస్తే బాగుంటుంది.

– వెంకట్రాములు, అయిజ

ప్రజలు సహకరించాలి..

మున్సిపాలిటీ నిర్వహణకు ఆస్తిపన్ను ప్రధాన ఆదాయ వనరు. మున్సిపాలిటీని అభివృద్ధి చేయాలంటే ప్రజలు ఆస్తిపన్ను చెల్లించాలి. బకాయిదారులు ఆస్తిపన్ను చెల్లించకుంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రజలు సహకరించాలి.

– శంకర్‌సింగ్, కమిషనర్, గద్వాల

జిల్లాలో ఆస్తిపన్ను వివరాలిలా..

మున్సిపాలిటీ	అసిస్మెంట్లు	వసూలు లక్ష్యం (రూ.లలో)	వసూలైంది (రూ.లలో)	శాతం
వడ్డెపల్లి	3800	91 లక్షల	81 లక్షలు	88.59
అయిజ	7706	1.45 కోట్లు	1.26 కోట్లు	86.90
అలంపూర్	3480	42 లక్షలు	34 లక్షలు	80.43
గద్వాల	15324	1.45 కోట్లు	1.26 కోట్లు	54.68

టాప్ టెన్‌లో ఉండడం గర్వంగా ఉంది..



ఈ ఏడాది ఆస్తి పన్ను వసూళ్లలో అయిజ మున్సిపాలిటీ ముందజలో ఉంది. మున్సిపాలిటీలోని అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ కృషిచేసినందుకే ఆస్తిపన్ను వసూళ్లలో రాష్ట్రంలో టాప్ టెన్‌లో అయిజ 8వ స్థానంలో ఉంది. ఆస్తిపన్ను చెల్లించి ప్రజలు మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నాం.

– సత్యంబాబు, కమిషనర్, అయిజ

బాల్య వివాహాలు అరికట్టేందుకు పటిష్ట చర్యలు



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల అర్బన్: బాల్య వివాహాలు అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను అదేశించారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీలోని కలెక్టర్ ఛాంబర్‌లో బేటీ బచావ్ బేటీ పడావ్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత అని, బాలికలు అందరు చదువుకునేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ డీడబ్ల్యూఓ సుధారాణి, డీసీపీఓ నర్సింహ్మా, సీడీపీఓ సుజాత, డిహెచ్ఈడబ్ల్యూ జోష్నా, పోషణ్ అభియాన్ కో ఆర్డినేటర్ కళ్యాణ్, రఘునాథ్ తదితరులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ సరిత

అలంపూర్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జెడ్పీచైర్‌పర్సన్ సరిత అన్నారు. శనివారం అలంపూర్ చౌరస్తాలో మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎందరో మహిళలు తమ జీవితంలో ఎదురైన ఒడిదుడుకులను తట్టుకుని ముందుకు సాగి తాము అనుకున్న లక్ష్యాలను సాధించారని, అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు. మహిళ అనుకుంటే సాధించలేనిదేది లేదని, మగవారు చేస్తున్న ప్రతి పనిని మహిళలు సైతం చేయగల్గుతున్నారంటే వారిలో ఉండే పట్టుదలే కారణమని అన్నారు. ప్రతి మహిళ కూడా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, బాలికలు విద్యార్థి దశ నుండే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పుల్లూరు మాజీ సర్పంచ్ నారాయణమ్మ,ఉండవెల్లి మాజీ సర్పంచ్ రేఖ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రుణ చెల్లింపులో జాప్యం వద్దు



రాజోళిలో చేనేత కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ గోవిందయ్య

రాజోళి: చేనేత కార్మికులు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను చెల్లించడంలో జాప్యం చేయవద్దని చేనేత జౌళి శాఖ ఏడీ గోవిందయ్య అన్నారు. శనివారం యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మండల కేంద్రం రాజోళిలో మొండి బకాయిల చెల్లింపు కోసం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులతో ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం వచ్చే సబ్సిడీ రుణాలు, ఇతర పథకాలు బ్యాంకుల ద్వారానే తీసుకునే అవకాశం ఉంటుందని, అలాంటి బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను చెల్లించకుండా బకాయిలు పెడితే వాటిని మొండి బకాయిలుగా పరిగణించబడతాయని, తద్వారా కార్మికులకు ట్రాక్ దెబ్బతిని రుణాలు తీసుకునేందుకు అనర్హులవుతారని అన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే బ్యాంకుల ద్వారా ఎక్కువ మొత్తంలో తక్కువ వడ్డీకే రుణాలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు



ఓవర్ హెడ్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్

అయిజ: వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ అన్నారు. శనివారం మండలంలోని భూంపురంను ఆయన సందర్శించారు. ఓవర్ హెడ్‌ట్యాంక్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీఓ నరసింహారెడ్డితో మాట్లాడారు. ఏప్రిల్‌లో మిషన్ భగీరథ నీరు నిలిచిపోయే అవకాశం ఉందని, దీంతో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు, సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో పర్యటించి ఎక్కడెక్కడ తాగునీటి సమస్య ఎక్కువగా ఉందో గమనించాలని అన్నారు. గతంలో నిర్మించిన బోరుబావుల్లో పూడిక తీయించాలని, మోటార్లకు మరమ్మతు చేయించాలని అన్నారు. ఎండలు ముదిరేకొద్ది తాగునీటి అవసరం ఎక్కువవుతుందని, నీటి వనరులు లేని గ్రామాల్లో అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని పలు సలహాలు చేశారు. గ్రామ కార్యదర్శి లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

తృణధాన్యాలతో పోషక భద్రత



మాట్లాడుతున్న సీడీపీఓ కమలాదేవి

అయిజ: దేశవ్యాప్తంగా మార్చి 9 నుంచి 23 వరకు 15 రోజులపాటు నిర్వహించనున్న పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీడీపీఓ కమలాదేవి కోరారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల గ్రామంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమంపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. మెరుగైన బాల్య సంరక్షణ, విద్య, గిరిజన సాంప్రదాయ, ప్రాంతీయ, స్థానిక ఆహార పద్ధతులు, పోషక ఆహారం గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా గర్భిణుల ఆరోగ్యం, శిశు, చిన్న పిల్లల ఆహార పద్ధతులను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారంతోపాటు ఆట, పాటలతో ప్రీ స్కూల్ విద్యను అందజేయాలని పలు సలహాలు, సూచనలు చేశారు. తృణధాన్యాలతో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని, రోజువారి ఆహారంగా వీటిని తీసుకోవడంవలన రోగనిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యామిని, వివిధ గ్రామాల అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

కేంద్రం తీరుతో రాజ్యాంగ సంస్థలు నిర్వీర్యం



పాతబస్టాండులో నిరసన తెలుపుతున్న సీపీఎం, సీపీఐ నాయకులు

గద్వాల అర్బన్: కేంద్రంలోని బిజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న చట్టబద్ధ, రాజ్యాంగ బద్ద సంస్థలను నిర్వీర్యం చేస్తుందని.. ఇందుకు వ్యతిరేకంగా జరిగే ఐక్య పోరాటాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీల నేతలను అక్రమ అరెస్టులను నిరసిస్తూ శనివారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండులో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాజ్యాంగ బద్ద సంస్థలైన ఈడీ, సీబీఐ, ఐటి, ఎన్నికల కమిషన్ వంటి వ్యవస్థలను అడ్డుపెట్టుకొని ప్రతిపక్ష పార్టీలను వేధిస్తున్నారని ఆరోపించారు. ఆమ్‌ఆద్మీ, బీఆర్‌ఎస్ వంటి ప్రతిపక్ష పార్టీల నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులను అక్రమ కేసులు, నిర్బంధాలు విధిస్తూ ప్రజాతంత్ర హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు వీవీ నర్సింహ్మా, ఉప్పేరు నర్సింహ్మా, బాలు, మహేష్, కృష్ణ, అయ్యన్న, రాజేష్ తదితరులు ఉన్నారు.





ఈ ఫొటోలోని రైతు కోస్గి వెంకటయ్య. మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్ మండలం జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆయన నాలుగు బోర్ల కింద 10 ఎకరాలు సాగు చేసేవాడు. ఎనిమిది ఎకరాల్లో వరి, రెండెకరాల్లో జొన్నలు, రాగులు ఇతర పంటలు పండించేవాడు. ఈ ఏడాది నీటి తగ్గడాన్ని గమనించి ముందుగానే వరి సాగు తగ్గించాడు. మూడు ఎకరాల్లో మాత్రమే వరి వేసి.. మిగిలిన భూమిని ఖాళీగా ఉంచాడు. అన్ని బోర్లలో నీటిమట్టం తగ్గడంతో రెండున్నర ఎకరాలు పూర్తిగా ఎండిపోగా.. మేకలు, బర్రెల మేతకు వదిలిపెట్టాడు. మొదట్లో నీళ్లు ఉండడంతో మూడు ఎకరాల పంటకు మందులు చల్లాడు. కలుపు ఎక్కువగా వస్తే కూలీలను పెట్టించి తీయించాడు. రూ.60 వేలకు పైగా పెట్టుబడి పెట్టానని.. కన్నీరే మిగిలిందని వాపోతున్నాడు. రెండుబోర్లు వట్టి పోగా ఉన్న ఒక్క దాంట్లో సన్నంగా నీళ్లు వస్తున్నాయని.. **మిగిలిన అర ఎకరం కూడా పండే అవకాశం లేదని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.**



ఈ ఫొటోలోని రైతు పేరు వడ్డె సాయిలు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం నేరళ్లపల్లి గ్రామానికి చెందిన ఆయన ఈ యాసంగిలో తనకున్న రెండెకరాలతో పాటు పక్కనే ఉన్న మరోమూడు ఎకరాల భూమి కౌలుకు తీసుకున్నాడు. నాలుగు ఎకరాల్లో వరి, ఎకరంలో మొక్కజొన్న సాగు చేశాడు. వర్షాభావ పరిస్థితుల్లో రెండు బోర్లలో భూగర్భజలాలు అడుగంటడంతో నీరు పారడం లేదు. చేసేదేమీ లేక రెండెకరాల వరిని పశువులకు మేతగా వదిలేశాడు. మరో ఎకరం మొక్కజొన్న కూడా ఎండిపోవడంతో దిగులు చెందుతున్నాడు. మొత్తంగా ఇప్పటివరకు పెట్టిన పెట్టుబడి రూ.70వేలు నష్టపోవాల్సి వచ్చిందని కన్నీటిపర్యంతమయ్యాడు.

అన్నదాత.. జలఘోష!



హన్వాడ మండలం మునిమోక్షంలో వరి పంటను మేస్తున్న పశువులు

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

గ్రాండ్ రిపోర్ట్

ఎకరానికి పైగా ఎండింది..



నాకు ఉన్న నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిలో మొక్కజొన్న సాగు చేశా. భూగర్భ జలాలు అడుగంటడం.. కరెంటు లైన్ దూరంగా ఉండడంతో ఎకరానికి పైగా చేను ఎండిపోయింది. సాగుకు ఇప్పటివరకు రూ.60 వేలకు పైగా పెట్టుబడి అయింది. కళ్ల ముందే చేతికొచ్చిన పంట ఎండిపోతుండడం భరించలేకపోతున్నా.

– కురువ దూల బుచ్చలయ్య, రాయపల్లి, రాజాపూర్



ఈ ఫొటోలోని రైతు పేరు ఇస్లావత్ శంకర్. బాలానగర్ మండలం గుండేడ్ గ్రామానికి చెందిన ఆయన తనకున్న ఎకరం భూమిలో పంటలు సాగు చేస్తున్నాడు. 30 గుంటల్లో వరి, పది గుంటల్లో జొన్న వేశాడు. పంటను కాపాడుకోవడానికి సుమారు 300 మీటర్ల దూరంలో ఉన్న బోరు నుంచి పైపులైన్ వేశాడు. తీరా బోరులో నీరు అడుగంటడంతో పంట ఎండిపోయింది. చేసేదేమీ లేక పశువులు, గొర్రెల మేతకు వదిలేశానని.. పెట్టుబడి పోను కేవలం పైపులైన్‌కు సుమారు రూ.30 వేలు అదనంగా ఖర్చయ్యాయని.. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.



"ఈ ఫొటోలో కన్పిస్తున్నది నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం మైలారం రైతు చంద్రయ్యకు చెందిన వ్యవసాయ పొలం పరిస్థితి. తనకు ఎకరం భూమి ఉంటే వేసవిని దృష్టిలో ఉంచుకుని యాసంగి పంటకు 30 గుంటల్లోనే వరినాట్లు వేశానని, గతేడాది వరకు ఎకరం భూమికి నీళ్లిచ్చిన బోరు ఈసారి చుక్కనీరు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందని చెబుతున్నాడు. ఇప్పటికే రెండు మడులు పూర్తిగా ఎండిపోగా మిగతా పొలంలోనూ గింజ కూడా మిగిలేలా కన్పించడం లేదని వాపోతున్నాడు.





వెల్దండ మండలం చొక్కనపల్లి గ్రామానికి చెందిన రైతు దూల జంగయ్య తనకున్న ఎకరం భూమిలో వరి పంటను సాగు చేశాడు. యేసంగి పంటకు గత 20 రోజుల నుంచి పంటకు నీరు అందటం కష్టంగా మారింది. నీరు లేక బోరు ఎత్తిపోవడంతో పంట ఎండిపోయిందని, దీంతో చేసేదేమీ లేక పశువులను మేపుతున్నానని చెబుతున్నాడు. ఇప్పటికే పెట్టుబడి కోసం రూ. 25 వేల వరకు ఖర్చు చేశానని, ఈసారి పంటకు కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చేలా లేవని ఆందోళన చెందుతున్నాడు.





ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు సిరిపె వభయ్యా. ఈయనది నారాయణపేట జిల్లా మంగనూరు మండలం ఓబులాపూర్ గ్రామం. మూడెకరాల్లో వరి వేస్తే రెండు ఎకరాలు నీళ్లు లేక ఎండిపోయింది. రెండ్రోజుల క్రితం సంగంబండ డ్యాం నుంచి మాగనూరు పెద్ద వాగుకు 0.16 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి కొద్ది గంటల్లోనే బంద్ చేశారు. అవి పూర్తిస్థాయిలో రాలేదు. వాగులో నీళ్ల కొరకు బోర్లు వేసిన నీళ్లు రావడం లేదు. ఒకవైపు నీళ్లు రాక మరో వైపు పంటలు ఎండిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది.



ట్రాక్టర్ సాయంతో..



కొత్తగార్లపల్లి సోమేశ్వరబండ శివారులో రైతు కురువ రాజేందర్ 15 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. 8 ఎకరాలకు నీరు సరి పోకపోవడంతో ట్రాక్టర్ సాయంతో నీటిని రిజర్వాయర్ నుంచి తోడేస్తున్నారు. వరి పంటకు దాదాపు రూ.6లక్షల వరకు ఖర్చు చేశారు. సాగుచేసిన పంట చేతికి అందకపోవడంతో తీవ్రంగా నష్ట పోతున్నామంటూ ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.

పశువులకు వదిలేశాం..



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు బస్సమొళ్ల నర్సింహులు. ఓబులాపురం గ్రామం, మాగనూరు మండలం నారాయణపేట జిల్లా. నాలుగు ఎకరాల పొలాన్ని ఎకరాకు రూ.10వేల చొప్పున కౌలుకు తీసుకున్నాడు. వరి ఒక ఎకరానికి రూ.25 వేలు ఇప్పటి వరకు పంటపై ఖర్చు చేశారు. బోర్లలో నీరురాకపోవడంతో పంట ఎండిపోయింది. చివరకు 4 ఎకరాల పొలంలో పశువులకు మేతగా వదిలేయడం జరిగింది.



పంట ఎండిపోయింది

మక్తల్ మండలం సోమేశ్వరబండ నాగిరెడ్డిపల్లికి చెందిన శివప్ప మూడెకరాల వరి పంటను సాగుచేశారు. బోరు ఎండిపోవడంతో సాగునీరు అందరక వరి పంట బీటలు వారింది. దీంతో పంటను వదిలేశారు.





ఈ ఫొటోలోని రైతు పేరు తూక్య నాయక్. వనపర్తి మండలం పెద్దగూడెం తండా గ్రామ పంచాయతీ పరిధిలో తనకున్న రెండు ఎకరాల పొలంలో బోరు బావి కింద వరి సాగు చేశాడు. వరి పొట్ట దశకు వస్తున్న తరుణంలో బోరు వట్టిపోయింది. 25 ఏళ్లుగా నీరు పాసే బోరు బావిలో నీళ్లు అడుగంటాయని.. రూ.70 వేల పెట్టుబడి నీళ్లపాలైందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం కనీసం పెట్టుబడి ఖర్చులు ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నాడు.

వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలో సుమారు ఏడు వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. బీమా కేఎల్ఐ కాల్వల ద్వారా సాగునీరు సరఫరా కాకపోవడం, బోరు బావుల్లో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో సాగు చేసిన పంటలు ఎండు ముఖం పట్టాయి. పాన్‌గల్‌లో స్వామి, రాజు అనే రైతులు మూడెకరాల్లో వరి సాగు చేయగా.. నీరు లేకపోవడంతో వదిలి పెట్టారు.






ఈ ఫొటోలో ఉన్న రైతు పేరు చెన్నప్ప. నారాయణపేట జిల్లా దామరగిద్ద. మూడు ఎకరాల పొలంలో వరి సాగు చేశారు. పంట పండుతుందని ఆశతో ఎకరాకు రూ.20వేల పెట్టుబడి పెట్టి వరి సాగు చేశారు. ఆయన మేనమామ మధ్యన ఉన్న మూడు బోర్లలో ఓ బోరు ఇప్పటికే ఎండిపోయింది. ఇంకో బోరు ఆగి ఆగి నీళ్లు వస్తున్నాయి. మూడో బోరు అర ఎకరం పొలమే పారుతుంది. నీళ్లు సరిపోకపోవడంతో వంతుల వారిగా పారిస్తున్నారు. నీళ్లు అందక ఎండిపోగా, గేదెలను మేపుతున్నారు. బోర్లు ఎండి నీళ్లు పారకపోవడంతో పండిన పంటను సమానంగా పంచుకోవాలని వారు నిర్ణయించుకొని బోర్లకు దగ్గరగా ఉన్న వరిమడులను పారించుకుంటున్నారు.

రెండున్నర ఎకరాల పంట పశువుల మేతకు..



బోరుబావిని ఆసరా చేసుకుని.. ఏటి చెరువు వెనుకాల రెండు ఎకరాల్లో వరి సాగు చేశాను. నాటు వేసిన 20 రోజుల్లో బోరు నుంచి చుక్కనీరు రాలేదు. ఎలాగైనా చెరువు నుంచి నీరు పారిద్దామనుకున్నా. దూరం ఎక్కువ కావడంతో అసాధ్యమైంది. చుట్టూ రైతుల బోర్లలో కూడా నీళ్లు లేవు. దీంతో రెండెకరాలు పశువుల మేతకే వదిలేశాను. ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల పెట్టుబడి అయింది. దాదాపు రూ.60 వేల నష్టం వాటిల్లింది. ప్రభుత్వం మాలాంటి రైతులను గుర్తించి సాయం అందించాలి. – శీలం అంజిలయ్య, రైతు, మహమ్మదాబాద్, మహబూబ్‌నగర్

ఎండిన వరి పొలంలో దీనంగా కూర్చున్న ఈ రైతు పేరు కురువ నర్సింహులు. గద్వాల జిల్లా ధరూరుకు చెందిన ఆయనకు నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో మూడు ఎకరాల్లో ఈ యాసంగిలో వరి, మిగిలిన ఎకరంలో వంకాయ తోట సాగు చేశాడు. నెల రోజుల్లో పంట చేతికొచ్చే సమయంలో భూగర్భజలాలు అడుగంటడంతో ఉన్న మూడు బోర్లలో నీళ్లు పూర్తిగా ఇంకిపోయాయి. మూడు ఎకరాల్లో వరి ఎండిపోగా.. చేసేదేమీ లేక రైతు ఆశలు వదులుకున్నాడు. రూ. లక్షకు పైగా పెట్టుబడి అయిందని.. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నాడు.



గద్వాల జిల్లా గట్టు మండలం పెంచికలపాడులో రైతు హనుమంతుకు చెందిన ఎకరం పొలం సాగు నీరందక ఎండిపోయిన దృశ్యం. తన కష్టం పోను రూ.50 వేల వరకు పెట్టిన పెట్టుబడి నష్టపోయినట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.



వెల్గొండ గ్రామంలో రైతులు తిరుపతయ్యగౌడ్, సత్యనారాయణగౌడ్, వెంకటస్వామి గౌడ్ ఐదెకరాల్లో వరి సాగు చేశారు. బోర్లు వట్టిపోవడంతో సాగునీరందక వరి ఎండిపోయింది. దీంతో పంటను గొర్లకు మేతగా వదిలేశారు.



5ఎకరాలు నష్టం

మక్తల్ సమీపంలో కాటన్ మిల్లు వద్ద రైతు వెంకటప్ప వరి సాగు చేశారు. కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేయగా, సంగంబండ రిజర్వాయర్ నుంచి నీరు అందకపోవడంతో పంటను వదిలేశారు. దాదాపు 5 ఎకరాల వరకు నష్టపోయారు. పంట చేతికి రాదని పశువులకు వదిలేశారు.



5 బోర్లు వేసినా.. ఒక్కటీ పడలేదు..



ఈ యాసంగిలో తొమ్మిది ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశా. ఇంక 20 రోజుల్లో పంట చేతికొస్తదని అనుకుంటున్న తరుణంలో బోరు పంపుల్లో నీళ్లు రావడం లేదు. పంటను కాపాడుకునేందుకు ఐదు బోర్లు వేసినా.. ఒక్కటి కూడా పడలేదు. చేసేదేమీ లేక చేను మొత్తం వదిలేశా. పంట పెట్టుబడి, కొత్తగా వేసిన బోర్లకు కలిపి మొత్తం రూ.2 లక్షల పెట్టుబడి అయింది. ఈ అప్పు ఎలా తీర్చాలో తెలియడం లేదు.

– గొల్ల కృష్ణయ్య, దాసర్‌పల్లి, చిన్నచింతకుంట

ప్రభుత్వం ఆర్థికసాయం అందించాలి..



బోరు బావి ఆధారంగా ఎకరన్నరలో వరి సాగు చేశా. మరో 15 రోజుల్లో పంట చేతికి వస్తుందన్న సమయంలో బోరు బావి వట్టిపోయింది. పంట పూర్తిగా ఎండిపోవడంతో పశువులకు మేతగా ఉపయోగిస్తున్నా. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి.

– సభావత్ కిషన్, రోడ్డు మీద తండా. ఖిల్లాఘనపురం

పీడీఎస్ బియ్యం స్వాధీనం

- చోరీ చేసిన వారి నుంచి వాటిని కొనుగోలు చేసిన వ్యాపారి అరెస్టు
- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం: చోరీకి గురైన పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసిన ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. కోడేరు అగ్రికల్చర్ మార్కెటింగ్ గోదాంలో నిల్వ ఉంచిన వడ్లతో పాటు పీడీఎస్ బియ్యం చోరీకి పాల్పడిన నిందితులు సదరు వ్యక్తికి వాటిని విక్రయించారని అన్నారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో వివరాలు వెల్లడించారు. గోదాంలో హమాలీగా పనిచేస్తున్న పవన్‌కల్యాణ్ తన స్నేహితులు రాంబాబు, అభిషేక్‌రెడ్డి, బిల్లకంటి మనుష్, ఎండీ ఫిరోజ్‌లతో కలిసి 2021–2022 సంవత్సరంలో నిల్వ ఉంచిన 5, 728 క్వింటాళ్ల వరిధాన్యాన్ని, 580 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని చోరీ చేశారని తెలిపారు. వాటిని పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్ గ్రామానికి చెందిన రైస్‌మిల్లర్, వ్యాపారి రాచూరి సునీల్‌కు విక్రయించారని పేర్కొన్నారు. కాగా ఇటీవల మరోమారు కోడేరు గోదాంలో బియ్యం చోరీకావడంతో పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కాగా చిన్నంబావి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన వడ్ల కేసులో.. అరెస్టయిన పెద్దకార్పాములకు చెందిన రాంబాబు, అభిషేక్‌రెడ్డిలను కోర్టు అనుమతి తీసుకుని విచారించినట్లు వెల్లడించారు. దీంతో 2021-2022లో కోడేరు అగ్రికల్చర్ మార్కెటింగ్ గోదాంలో చోరీ గురించి నేరాన్ని అంగీకరించారని తెలిపారు. అదేవిధంగా రాచూరి సునీల్‌కు వాటిని విక్రయించినట్లు తెలిపారని పేర్కొన్నారు. కాగా శనివారం రాచూరి సునీల్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా నేరం అంగీకరించాడన్నారు. నిందితుడి నుంచి రూ. 16లక్షల నగదు, ఒక ఆటో, 150 సంచుల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు.

వీడిన మహిళ హత్య మిస్టరీ

- నిందితుడి నుంచి బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం: బంగారు, వెండి ఆభరణాల కోసం మహిళను హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పూర్తి వివరాలు వెల్లడించారు. లింగాల మండలం అవుసలికుంటకు చెందిన పుట్టా శివుడు ఇనుప సామగ్రి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి తెల్కపల్లి మండలం పెద్దపల్లికి చెందిన లలితతో వివాహేతర సంబంధం ఏర్పడటంతో తరుచూ ఇంటికి వచ్చేవాడు. ఇదే క్రమంలో ఆమె వద్ద బంగారు, వెండి ఆభరణాలు ఉన్నట్లు గుర్తించి ఈ నెల 9న ఆభరణాలు ధరించి అచ్చంపేటకు రావాలని సూచించాడు. దీంతో లలిత అచ్చంపేటకు రాగానే ఓ దుకాణంలో మద్యం కొనుగోలు చేసి ఆటోలో బల్మూరు మండలం మైలారం గ్రామ శివారుకు వెళ్లారు. ఇద్దరు కలిసి మద్యం తాగారు. లలిత మద్యం మత్తులోకి జారుకోగానే బండరాయితో తలపై మోదడంతో పాటు సీసాతో పొడిచి హత్య చేసి ఆమె వద్ద ఉన్న 6 తులాల బంగారం, 40 తులాల వెండి ఆభరణాలను తీసుకొని పరారయ్యాడు. ఈ నెల 13న కుళ్లిన మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సీసీ కెమెరాల్లో పుట్టా శివుడు, లలిత ఆటోలో వెళ్లిన దృశ్యాలను సేకరించారు. శనివారం నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేయడంతో నేరాన్ని ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వివరించారు. నిందితుడిని పట్టుకున్న అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రవీందర్, ఎస్ఐ బాలరాజు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

సాష్టాంగ నమస్కారాలు పెడుతూ రామేశ్వరానికి యాత్ర



దండాలు పెడుతూ రామేశ్వరానికి వెళ్తున్న రాజ్‌గిరి మహారాజ్

కొత్తకోట రూరల్: లోకకల్యాణార్థం గతేడాది ఏప్రిల్ 14న ఉత్తరాఖండ్ రాష్ట్రం గంగోత్రికి చెందిన రాజ్‌గిరి మహారాజ్ సాష్టాంగ నమస్కారాలు పెడుతూ.. రామేశ్వరానికి చేపట్టిన యాత్ర శనివారం కొత్తకోట పట్టణ కేంద్రానికి చేరుకుంది. సాష్టాంగ నమస్కారాలు పెడుతూ వెళ్తున్న రాజ్‌గిరి మహారాజ్‌కు పట్టణవాసులు స్వాగతం పలికారు. వారికి వాటర్ బాటిల్స్ ఇవ్వడంతో పాటు కొంత నగదును అందజేశారు. యాత్ర దిగ్విజయంగా కొనసాగాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భీమన్న నాయుడు, రాజుసాగర్, రాములు, లాలునాయుడు, రవి, గోవర్ధన్, మన్యం పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
■ లీగల్ & డిటెక్టివ్ (ప్రై): సివిల్, క్రిమినల్, ఫ్యామిలీ, ప్రాపర్టీ, డివోర్స్, హై కోర్ట్, సుప్రీమ్ కోర్ట్ పెండింగ్ కేసులు Fast సెటిల్‌మెంట్ మరియు వెరిఫికేషన్ కొరకు అడ్వకేట్ AS రెడ్డి: 9876094111.

HEALTH CARE
ORTHOPEDIC SURGEON
■ డా॥ యస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శిరీష పాలీ క్లినిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, 3వ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 – 228888, 83412 98888

GENERAL & LAPROSCOPIC SURGEON
■ కార్తీక్ హాస్పిటల్, సంకేసుల రోడ్, కర్నూలు. సంతాన సమస్యలు, స్త్రీ వ్యాధులు, జనరల్, బీ.పి, షుగర్ వ్యాధులకు ఉత్తమ చికిత్స. EHS సౌకర్యం కలదు. డా॥ యస్.చంద్రశేఖర్, M.D. ఫిజిషియన్, డా॥ పార్వతీదేవి, M.D.DGO, స్త్రీ వ్యాధి, ల్యాపరోస్కోపి నిపుణులు. టైమింగ్స్ 10-8PM, 08518-226162

WANTED
■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగుళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376.
■ బీకాం డిగ్రీ అకౌంటెంట్స్, టాలీ ఈ ఆర్ పి 9, MS ఆఫీస్ Fresher/Exp కలిగినవారు 3 సం॥ లు కాంట్రాక్ట్ కొరకు మరియు ఆఫ్రికా దేశంలో పని చేయుటకు కావలెను. 9888853527

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 89197 39694.
■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ. 18k. ఫోన్ 9840468899 / 9840258899
■ Req. ITI Fitters/ Dip. Mech/ECE candidates for Electronic Industry, Hardware Park, Hyderabad. Ph:9625064269/ 8341181182.

సాక్షి భవిత విద్యార్థుల కోసం

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్వసించి పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే రీతి క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు – సాక్షి మేనేజర్

వ్యక్తి బలవన్మరణం

గండేడ్/మహమ్మదాబాద్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం వెలుగు చూసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని జంగంరెడ్డిపల్లికి చెందిన జక్లపల్లి ఆంజనేయులు(30)కు హన్వాడ మండలం సల్లోనిపల్లికి చెందిన అరుణతో మూడేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఏడాది కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తలిద్దరూ తరుచూ గొడవపడేవారు. వారం కిందట పిల్లాడికి ఆరోగ్యం బాగోలేకపోతే ఆస్పత్రిలో చూపించమని భర్తను అడగగా ఆయన తీసుకెళ్లకపోవడంతో అరుణ కుమారుడిని తీసుకొని తల్లి గారి ఊరైన సల్లోనిపల్లికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన ఆంజనేయులు ఉరేసుకున్నాడు. శనివారం ఉదయం ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వచ్చి ఇల్లు తెరిచి చూడగా ఆంజనేయులు ఇంట్లో ఊరేసుకొని చనిపోయి కనిపించాడని.. రెండ్రోజుల కిందట ఆత్మహత్య చేసుకుని ఉంటాడని ఎస్ఐ తెలిపారు. మృతదేహం కుళ్లిపోవడంతో వైద్యులను పిలిపించి అక్కడికేపోస్టుమార్టం నిర్వహించారు. సాయంత్రం జంగంరెడ్డిపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. అక్క బోయిని మైబమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఉరేసుకుని మరొకరు..

భూత్పూర్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మున్సిపాలిటీలోని మీత్యాతండాలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. మీత్యాతండాకు చెందిన టి.దేవులా (41), అతడి భార్య లక్ష్మి జీవనోపాధి నిమిత్తం 18 ఏళ్ల కిందట హైదరాబాద్‌కు వెళ్లారు. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఇటీవల కూతురితో కలిసి దేవులా స్వగ్రామమైన మీత్యాతండాకు వచ్చాడు. లక్ష్మి కుమారుడితో కలిసి హైదరాబాద్‌లోనే ఉంది. ఈక్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దేవులా ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెనిమిళ్లలో వృద్ధుడు..

ఉప్పునుంతల: మండలంలోని పెనిమిళ్లకు చెందిన కుంచెపు తిరుపతయ్య (60) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య రామేశ్వరమ్మతో పాటు ముగ్గురు సంతానం ఉన్నారు. మద్యం తాగిన మైకంలో ఇంట్లో గొడవపడి, ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు.

షెల్ కంపెనీతో సీఎం రమేశ్ టోకరా

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన సన్నిహితుడు పి. నాగేశ్వరరావు పక్కా స్కెచ్‌తో పాల్పడిన ఈ ఘరానా మోసంపై హైదరాబాద్‌లో కేసు నమోదైంది. సంతకాలు ఫోర్జరీ చేసి రిత్విక్ స్వాతి అనే బోగస్ కంపెనీ పేరిట సబ్‌కాంట్రక్టు ఒప్పంద పత్రాలు సృష్టించి మరీ ఈ మోసానికి తెగబడ్డారు. ఈ మేరకు ప్రముఖ సినీ నటుడు, పీసీఎల్ ఇంటర్‌టెక్ లెన్‌హైడ్రో కాన్సార్షియం జాయింట్ వెంచర్ ఆథరైజ్డ్ సిగ్నేచరీగా ఉన్న తొట్టెంపూడి వేణు, కేంద్ర మాజీమంత్రి కావూరి సాంబశివరావు కుమారుడు కావూరి భాస్కర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు గత ఏడాదే ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వారిపై ఐపీసీ సెక్షన్లు 420, 468, 471 కింద కేసు నమోదు చేశారు. ఫోర్జరీ సంతకాలతో సీఎం రమేశ్ పాల్పడిన ఈ మోసానికి సంబంధించిన మరిన్ని కీలక ఆధారాలను తొట్టెంపూడి వేణు, కావూరి భాస్కర్‌రావు హైదరాబాద్ పోలీసులకు శనివారం అందించారు. కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని కోరారు. ఈ ఘరానా మోసం వివరాలిలా ఉన్నాయి..

పీసీఎల్ కన్సార్షియంకు తెహ్రీ హైడ్రో ప్రాజెక్టు..

ఉత్తరాఖండ్‌లో తెహ్రీ హైడ్రో ప్రాజెక్టు వద్ద సివిల్ ప్రాజెక్టు కాంట్రాక్టును పీసీఎల్ ఇంటర్‌టెక్ కన్సార్షియం దక్కించుకుంది. ఈ మేరకు తెహ్రీ హైడ్రో



డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీహెచ్‌డీసీ)తో 2002లో ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం ఆ ప్రాజెక్టు వ్యవహారాలను నిర్వహించేందుకు పీసీఎల్ కన్సార్షియం తమ ప్రతినిధిగా కావూరి భాస్కర్‌రావును జనరల్ పవర్ ఆఫ్ అటర్నీ (జీపీఏ) ద్వారా నియమించింది. కొంతకాలం ప్రాజెక్టు పనులు చేపట్టిన తరువాత పీసీఎల్ కన్సార్షియంకు టీహెచ్‌డీసీతో విభేదాలు తలెత్తాయి. దీంతో ఆ వ్యవహారం న్యాయస్థానం ఆర్బిట్రేషన్‌కి చేరింది. ఢిల్లీ కోర్టులో ప్రస్తుతం వ్యాజ్యం కొనసాగుతోంది. పీసీఎల్ కన్సార్షియంకు చెల్లించాల్సిన బిల్లుల మొత్తాన్ని టీహెచ్‌డీఏ న్యాయస్థానంలో డిపాజిట్ చేసింది.

ఫోర్జరీ సంతకాలతో సీఎం రమేశ్ మోసం..

ఇలా ఓ వైపు ఈ న్యాయ వివాదం కొనసాగుతుండగా.. సీఎం రమేశ్ గుట్టుచప్పుడు కాకుండా ఓ కథ నడిపించారు. పి. నాగేశ్వరరావు అనే వ్యక్తి తమ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని పీసీఎల్ కన్సార్షియం 2011లో గుర్తించింది. ఆ మేరకు ఆయన ఓ జీపీఏను కూడా సృష్టించారని తెలుసుకుని షాక్‌కు గురైంది. అంతేకాదు.. తమ కన్సార్షియం ప్రతినిధిగా చెప్పుకుంటూ ఆయన సీఎం రమేశ్‌కు చెందిన బోగస్ కంపెనీ రిత్విక్ స్వాతికి టీహెచ్‌డీఏ ప్రాజెక్టు సబ్ కాంట్రాక్టును ఇచ్చినట్లు పత్రాలు సృష్టించారు. వాటిని చూపిస్తూ టీహెచ్‌డీఏ ప్రాజెక్టు బిల్లులు పొందేందుకు సీఎం రమేశ్‌కు చెందిన రిత్విక్ స్వాతి కంపెనీ వ్యవహారం నడిపింది. పి. నాగేశ్వరరావు అనే వ్యక్తి కేవలం పరిమిత కాల జీపీఏతో పీసీఎల్ కన్సార్షియం ప్రతినిధిగా టీహెచ్‌డీఏ ప్రాజెక్టు పనులను పర్యవేక్షించారు. కానీ, ఆయన వ్యవహారశైలి నచ్చక ఆ జీపీఏ కాలపరిమితి ముగియగానే ఆయన్ని తొలగించారు. అయినాసరే.. తమ సంతకాలు ఫోర్జరీ చేసి మరో జీపీఏ సృష్టించుకోవడంతో పాటు.. సీఎం రమేశ్‌కు చెందిన బోగస్ కంపెనీ రిత్విక్ స్వాతితో తమ కంపెనీ పేరుతో సబ్ కాంట్రాక్టు ఒప్పందం చేసుకున్నట్లుగా పీసీఎల్ కన్సార్షియం గుర్తించింది. ఈ ఒప్పందంలో పి.నాగేశ్వరరావు తన చిరునామాలో ఆంధ్రప్రదేశ్‌లోని చిలకలూరిపేటను పేర్కొన్నారు. దీనిపై పీసీఎల్ కన్సార్షియం చిలకలూరిపేట పోలీసులను ఆశ్రయించగా ఆయన తప్పుడు చిరునామా ఇచ్చారని గుర్తించారు. అసలు చిరునామాను కూడా గుర్తించి వెల్లడించారు. షెల్ కంపెనీ ద్వారా నిధులు కొల్లగొట్టేందుకు ఉద్దేశించిన ఆ బోగస్ సబ్ కాంట్రాక్టు ఒప్పందం ద్వారా సీఎం రమేశ్, పి.నాగేశ్వరరావు ఈ మోసానికి పాల్పడ్డట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో పీసీఎల్ కన్సార్షియం ఈ విషయాన్ని ఈ–మెయిల్ ద్వారా టీహెచ్‌డీఏ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందిందని టీహెచ్‌డీఏ ఉన్నతాధికారులు నిర్ధారించారు.

సీఎం రమేశ్ రూ.450 కోట్లు కొల్లగొట్టారు : కావూరి భాస్కర్‌రావు

‘పీసీఎల్ జాయింట్ వెంచర్ కంపెనీకి సంబంధించి సీఎం రమేశ్ ఫోర్జరీకి పాల్పడ్డారు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ఏసీపీ ఎదుట హాజరై వాంగ్మూలం ఇచ్చాను. దాదాపు అరగంట పాటు నా స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు. ఈ ఫోర్జరీ ద్వారా సీఎం రమేశ్ దాదాపు రూ.450 కోట్లు స్వాహా చేశారు. దీనికి సంబంధించి కోర్టులోనూ ఓ కేసు నడుస్తోంది. సీఎం రమేశ్‌పై సీబీఐ దర్యాప్తు జరిగితే రూ.వేల కోట్ల స్కాంలకు సంబంధించిన విషయాలు బయటకొస్తాయి’.. అని కావూరి భాస్కర్‌రావు మీడియాకు చెప్పారు.

మరోవైపు.. ఆ సబ్ కాంట్రాక్టు ఒప్పంద పత్రాలను కావూరి భాస్కర్‌రావు ట్రూత్‌ల్యాబ్ అనే ప్రైవేటు సంస్థ ద్వారా ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించారు. పి. నాగేశ్వరరావు, రిత్విక్ స్వాతి కంపెనీ ఉద్దేశపూర్వకంగా సంతకాలు ఫోర్జరీ చేసినట్లు ఆ పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. ఈ అంశాన్ని పీసీఎల్ కన్సార్షియం ప్రతినిధులైన తొట్టెంపూడి వేణు, కావూరి భాస్కర్‌రావు హైదరాబాద్ పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం రమేశ్‌కు చెందిన రిత్విక్

ఫోరెన్సిక్ పరీక్షల్లో ఫోర్జరీ నిర్ధారణ..

స్వాతి కంపెనీ ప్రధాన కార్యాలయంలోనే ఫోర్జరీ సంతకాలతో బోగస్ సబ్ కాంట్రాక్టు ఒప్పందం చేసుకున్నారని తేలింది. దీంతో జూబ్లీహిల్స్ పోలీసులకు గత ఏడాది నవంబరు 4న ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించి ఫోర్జరీ సంతకాల విషయాన్ని నిర్ధారించాలని కోరారు. తప్పుడు ఒప్పందంతో తమ కంపెనీని మోసం చేసిన సీఎం రమేశ్, పి. నాగేశ్వరరావులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీరి మోసానికి సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉండటంతో వారిపై హైదరాబాద్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తొట్టెంపూడి వేణు, కావూరి భాస్కర్‌రావు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాసరెడ్డిని శనివారం కలిసి ఈ కేసు దర్యాప్తు వేగవంతం చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కేసుకు సంబంధించి తాము సేకరించిన మరిన్ని కీలకపత్రాలను కూడా పోలీసులకు అందించారు.

సరైన కారణం ఉండాలి

▶ మొదటి పేజీ తరువాయి

కారణంతో జీఎస్టీ చట్టంలోని సెక్షన్ 69 కింద నిర్బంధం సరికాదని వ్యాఖ్యానించారు. జీఎస్టీ అంశంలో వ్యాపారులను అరెస్టు చేయడానికి అనుమతించే ముందు అందుకు కారణాలను లిఖితపూర్వకంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. శనివారం ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ (సౌత్‌జోన్), తెలంగాణ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సంయుక్తంగా హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ పన్నుల సదస్సుకు జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ‘ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడం రెండు రకాల సంతోషానిచ్చింది. పన్ను అంశంపై అనుభవం ఉన్న న్యాయవాదిగా ఇంత మంది ట్యాక్స్ ప్రాక్టీషనర్ల మధ్య పాల్గొనడం ఒకటైతే.. హైదరాబాద్‌ను సందర్శించడం మరొకటి. ఇక్కడ న్యాయమూర్తిగా, ప్రధాన న్యాయమూర్తిగా పనిచేయడంతో నగరంతో అనుబంధం ఏర్పడింది. హైదరాబాద్ వస్తే ఇంటికి వచ్చినట్లే ఉంటుంది. ఇలాంటి అవకాశాలు వచ్చినప్పుడు వీలున్నంత వరకు నగరాన్ని సందర్శిస్తా’అని చెప్పారు. ఎవరైనా ఆదాయపు పన్ను నివేదిక సమర్పిస్తే.. అది తప్పుడు నివేదిక అని పూర్తిగా నమ్మితే మాత్రమే అసెస్‌మెంట్‌ను తిరిగి ప్రారంభించాలని సుప్రీంకోర్టు గతంలో పేర్కొందని ఆయన వివరించారు.

‘ఆయుధాన్ని’దుర్వినియోగం చేయొద్దు..

‘సీజీఎస్టీలోని సెక్షన్ 69, సెక్షన్ 83.. రాష్ట్ర జీఎస్టీలోని ఇవే నిబంధనలు అధికారులకు కఠిన అధికారాలను అందించాయి. ఈ రెండు నిబంధనలు రెవెన్యూ చేతిలో బలమైన ఆయుధాలు. వీటిని జాగ్రత్తగా, తక్కువగా ఉపయోగించాలి. ఆయుధాన్ని అతిగా ప్రయోగించినా.. దుర్వినియోగపరచినా.. దాని శక్తిని కోల్పోతుందని మనకు తెలుసు. ఇదే జరిగితే అధికారులపై నమ్మకం పోతుంది. ఒక నిబంధన ఎంత కఠినంగా ఉంటే న్యాయపరమైన పరిశీలన కూడా అంతే కఠినంగా ఉంటుందన్న విషయం గుర్తుంచుకోవాలి’అని జస్టిస్ ఉజ్జల్ భూయాన్ సూచించారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ.. ‘పన్ను వసూలు అనేది సమాజానికి నాడు, నేడు కీలకమైన అంశాల్లో ఒకటి. ఇది ఏ దేశంలో అయినా ప్రభుత్వాన్ని నడపడానికి ఎంతో అవసరం. శతాబ్దాల నుంచి పన్ను విధింపు చట్టాలు మారుతూ వస్తున్నాయి. ఒక తేనెటీగ పువ్వు నుంచి మకరందాన్ని ఎలా సేకరిస్తుందో పన్ను వసూలు కూడా అంతే సున్నితంగా జరగాలని కౌటిల్యుడు వందల సంవత్సరాల క్రితమే చెప్పాడు. ఆధునిక భారత్‌లో కొత్త పన్ను విధానాలతో దేశం పురోగతిలో పయనిస్తోంది’అని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ తుకారాంజీ, జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి, జస్టిస్ అనిల్‌కుమార్, అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) నరసింహశర్మ, ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలా జయ్‌దేవ్, టీటీపీఏ అధ్యక్షుడు కె.నర్సింగ్‌రావు, ఏఐఎఫ్‌టీపీ (సౌత్‌జోన్) చైర్మన్ రామరాజు శ్రీనివాస్‌రావు, సుదీర్ వీఎస్, మహమ్మద్ ఇర్షాద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

చదరపు మీటర్‌కు రూ.6 వేలు చెల్లించండి

- ‘ఏపీఐఐసీ’ ప్లాట్ లబ్ధిదారుకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: జీడిమెట్ల లోని ఇండస్ట్రియల్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేజ్–2లో ప్లాట్ పొందిన లబ్ధిదారు రష్మి అభిచందని చదరపు మీటర్‌కు రూ.6 వేలు చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. మార్కెట్ విలువ గజానికి రూ.12 వేలుగా ఉండగా, ఇప్పటికే రూ.6 వేలు చెల్లించారు కాబట్టి మిగిలిన మొత్తాన్ని 3 నెలల్లో చెల్లించాలని అభిచందణికి స్పష్టం చేసింది. ‘జీడిమెట్లలోని ఇండస్ట్రియల్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేజ్–2లో రష్మి అభిచందనికి 523 గజాల ప్లాట్‌ను (నంబర్ 12) తక్కువ ధరకు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) కేటాయించడం చట్టవిరుద్ధం. ఏపీఐఐసీ ఉద్యోగి అభిచందని ప్రొబేషన్ పీరియడ్‌లో ఉండగా ప్లాట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. తొలుత ఆమెకు 265 చదరపు మీటర్ల ప్లాట్ నం.15ను తాత్కాలికంగా కేటాయించారు. చదరపు మీటర్‌కు రూ.6,000 చెల్లించారు. తర్వాత 523.50 చదరపు మీటర్ల ప్లాట్ నంబర్ 12కోసం ఆమె అభ్యర్థించగా కేటాయించారు. మొత్తం రూ.31,41,000 చెల్లించి సేల్ డీడ్ పొందారు. చట్టవిరుద్ధంగా ప్లాట్ పొందినందున.. సదరు ప్లాట్‌కు బహిరంగ వేలం నిర్వహించేలా ఏపీఐసీసీకి ఆదేశాలు ఇవ్వాలి. మోసానికి పాల్పడిన రష్మి, మరో ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకోవాలి’ అంటూ న్యాయవాది పాశం కృష్ణారెడ్డి తరఫున న్యాయవాది గాడిపల్లి మల్లారెడ్డి 2011లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం తీర్పు వెలువరించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గంద్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. ‘పిటిషనర్‌కు గతంలోనే ఇళ్లు, రెండు ప్లాట్లు ఉన్నాయి. భూసేకరణ జరిపి ఏపీఐసీసీ పరిశ్రమలకు కేటాయించాలి తప్ప.. ఇళ్ల స్థలాలు ఇవ్వడం కూడా సరికాదు. అది కూడా ప్రొబేషన్‌లో ఉన్న ఉద్యోగికి కేటాయించడం సమర్థనీయం కాదు. ఇలా ప్లాట్ కేటాయించడం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుంది’ అని వాదనలు వినిపించారు. అభిచందని తరఫు న్యాయవాది వాదిస్తూ.. పిటిషన్‌ను ఉద్దేశపూర్వకంగా దాఖలు చేశారని, ప్రజా ప్రయోజనం లేదని వాదించారు. వాదనలు విన్న ధర్మాసనం.. భూమి కేటాయింపులో ఎలాంటి జోక్యం అవసరం లేదని అభిప్రాయపడింది. ప్లాట్ మార్కెట్ విలువలో సగం మొత్తాన్ని గతంలో చెల్లించినందున.. మిగిలిన మొత్తాన్ని 3 నెలల్లోగా చెల్లించాలని లబ్ధిదారును ఆదేశించింది.

వసతి గృహాల బకాయిలు రూ.343 కోట్లు!

- తొమ్మిది నెలలుగా విడుదల కాని డైట్ చార్జీలు
- దీంతో నిర్వహణ కష్టంగా మారిందంటున్న అధికారులు
- అప్పులు తెచ్చి విద్యార్థులకు భోజనం పెడుతున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ వసతి గృహాల్లో బకాయిలు పేరుకుపోయాయి. తొమ్మిది నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో నిర్వహణ తలకుమించిన భారంగా మారిందంటూ వసతిగృహ సంక్షేమాధికారులు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల విడుదలకు గ్రీన్‌చానల్ ఏర్పాటు చేస్తామని చెప్పినా.. ఇప్పటి వరకు పైసా విడుదల కాని పరిస్థితి ఉందని అంటున్నారు. సంక్షేమ వసతిగృహాలకు కనీసం డైట్ చార్జీలకు సంబంధించిన బిల్లులు కూడా ప్రభుత్వం ఇవ్వలేదు. మరో వారం రోజుల్లో 2023–24 ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో ఆలోపు నిధులు విడుదల కోసం వసతిగృహాల నిర్వహణ అధికారులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల పరిధిలో 1,550 హాస్టళ్లున్నాయి. వీటి పరిధిలో 2.28 లక్షల మంది విద్యార్థులున్నారు. ఈ మూడు సంక్షేమ శాఖలకు సంబంధించిన హాస్టళ్ల బిల్లులు దాదాపు రూ.343 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

అప్పులు చేసి నిర్వహణ..

వసతిగృహాల నిర్వహణకు సంబంధించి చెల్లింపులను ప్రభుత్వం గ్రీన్‌చానల్ పద్ధతిలో ఇవ్వనున్నట్లు స్పష్టం చేసింది. అయితే ఈ నిర్ణయం ఇప్పటివరకు అమలు కాలేదు. ఇది వరకు వసతిగృహాలకు సంబంధించిన చెల్లింపులు ప్రతి త్రైమాసికంలో ఒకసారి జరిగేవి. ఒక్కోసారి చెల్లింపులు నిలిచినప్పటికీ.. ఆ తర్వాతి త్రైమాసికంలో ప్రాధాన్యత క్రమంలో నిధులను విడుదల చేయడంతో నిర్వాహకులకు కొంత ఊరట దక్కేది. కానీ గత తొమ్మిది నెలలుగా సంక్షేమ వసతిగృహాలకు సంబంధించిన బిల్లులు క్లియర్ కాలేదు. గతేడాది జూన్‌లో నిధులను విడుదల చేసిన ప్రభుత్వం.. ఆ తర్వాతి నుంచి చెల్లింపులన్నీ నిలిపివేసింది. దీంతో నిర్వాహకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రతి నెలా కిరాణా సరుకులు, కూరగాయలు, ఇతర సరుకుల కోసం వసతిగృహ సంక్షేమాధికారులు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. కొన్నిచోట్ల వ్యాపారులకు తర్వాత డబ్బులు చెల్లిస్తామని ఇప్పటివరకు సరుకులు తీసుకోగా.. ఇప్పుడు బకాయిలు చెల్లిస్తేనే సరుకులిస్తామని వ్యాపారులు తేల్చిచెప్పడంతో సంక్షేమాధికారులు తలపట్టుకుంటున్నారు.



విద్యార్థుల భోజనంపై ప్రభావం..

హాస్టళ్లకు నిధులు విడుదల చేయకపోవడంతో ఆ ప్రభావం విద్యార్థులకు అందించే భోజనంపైన తీవ్రంగా పడుతోంది. అరువు పద్ధతిలో సరుకులు తీసుకువస్తున్నప్పటికీ నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. వారంలో రెండ్రోజులు ఉడికించిన గుడ్లు, ఒక రోజు మాంసాహారం ఇవ్వాల్సి ఉండగా.. చాలా హాస్టళ్లలో పప్పు, చారు, కూరగాయలతో కూడిన ఆహారాన్నే అందిస్తున్నారని వాపోతున్నారు.

కాన్పు కోసం వెళ్తే.. ప్రాణం తీశారు

- మారని అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రి తీరు
- హై రిస్కు కేసులను రెఫర్ చేస్తూ చేతులు దులుపుకొంటున్న వైనం
- తాజాగా వైద్యుల నిర్లక్ష్యానికి బాలింత బలి?



కల్పన (ఫైల్)

అచ్చంపేట రూరల్/ మన్ననూర్: ప్రభుత్వాలు మారినా.. ప్రజాప్రతినిధులు మారినా.. అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రిలో వైద్యుల తీరు మారడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తిస్తూ.. స్థానికంగా ప్రైవేట్ ఆస్పత్రులు ఏర్పాటు చేసుకుని అక్కడే ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే కేసులను తమ ఆస్పత్రులకు రెఫర్ చేసుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అక్కడక్కడ ఏమైనా సంఘటనలు జరిగితే రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారుల హడావుడి చేయడం.. ఆ తర్వాత వదిలేయడం షరా మామూలుగా మారిపోయింది. కొందరు వైద్యులు, వారి బంధువులు రాజకీయ పార్టీలకు అనుబంధంగా పనిచేస్తుండటంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా ఉంటుంది. అచ్చంపేట ఆస్పత్రిలో వైద్యం వికటించి మరణాలు సంభవించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగితే చర్యలు తీసుకుంటామని వైద్యశాఖ ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నా.. అవి తమకేమీ పట్టనట్లుగా స్థానిక వైద్యులు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులుగా చేరి ప్రైవేటుగా ఏర్పాటు చేసుకుని వైద్యం మాటున వ్యాపారం చేస్తున్నారని జోరుగా ప్రచారం జరుగుతున్నా ఉన్నతాధికారులు వారిపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.



అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రి

నిండు ప్రాణం బలి..

అమ్రాబాద్ మండలం మన్ననూరుకు చెందిన నిండు గర్భిణి కల్పన(30) పురిటినొప్పులు రావడంతో ఆమె భర్త ఆంజనేయులు గురువారం అచ్చంపేట వంద పడకల ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. విధుల్లో ఉన్న డ్యూటీ డాక్టర్ తమ ప్రైవేట్ ఆస్పత్రిలో చూయించుకోలేదని అక్కసుతో ప్రసవం చేయకుండా నిర్లక్ష్యం చేసిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. పురిటి నొప్పులు అధికం కావడంతో గర్భిణి బాధను చూడలేక గత్యంతరం లేక భర్త అచ్చంపేటలోని లింగాల రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యుడు బేరమాడి ఆపరేషన్ చేశాడు. మహిళ పండంటి మగ శిశువుకు జన్మనిచ్చింది. శిశువు ఆరోగ్యం బాగానే ఉన్నా.. బాలింతకు తీవ్ర రక్తస్రావమైంది. దీంతో ప్రైవేటు వైద్యుడు జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. పరీక్షించిన వైద్యులు గర్భసంచి తొలగిస్తే రక్తస్రావం ఆగిపోతుందని చెప్పి.. తొలగించినప్పటికీ రక్తస్రావం ఎంతకీ ఆగలేదని మహిళ భర్త ఆంజనేయులు వాపోయాడు. జిల్లా ఆస్పత్రి వైద్యులు బలవంతంగా మహిళకు ఆక్సిజన్ పెట్టి గాంధీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడి వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతిచెందిందని చెప్పారని ఆంజనేయులు పేర్కొన్నాడు. తన భార్య చనిపోవడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని గర్భిణి భర్త ఆంజనేయులు, కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

హెచ్‌బీ తక్కువగా ఉంది..

ప్రసవం కోసం ఆస్పత్రికి వచ్చిన గర్భిణికి హెచ్‌బీ 7 గ్రాములు మాత్రమే ఉంది. మాయ కిందికి ఉండటం, మూడో కాన్పు, అందులో రెండుసార్లు సిజేరియన్ కావడంతో హై రిస్కు కేసుగా పరిగణించాం. ఆస్పత్రి సూపరింటెండెంట్ సూచనతోనే రెఫర్ చేశాం.

– తేజస్విని, డ్యూటీ డాక్టర్, అచ్చంపేట

ఫోన్ ఎత్తని సూపరింటెండెంట్..

అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభు సమాచారం నిమిత్తం అధికారులు, ప్రజాప్రతినిధులు ఫోన్ చేసినా ఎత్తడం లేదని తెలుస్తోంది. ఆస్పత్రిలో ఏమైనా సంఘటన జరిగితే ఎవరు ఫోన్ చేసినా ఎత్తడం లేదు. కాగా మృతిచెందిన మహిళ కుటుంబ సభ్యులు, బంధువులతో ప్రైవేటు వైద్యుడు మంతనాలు జరుపుతున్నారని, సెటిల్‌మెంట్‌కు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లిలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీనారసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షబంధనం, మృత్సంగ్రహణం, ధ్వజారోహణం, కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి దేవత ఆహ్వానం, బేరి పూజ, హంస వాహన సేవ కార్యక్రమాలు చేపట్టనున్నామని అర్చకులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 11 గంటలకు ఎదుర్కోళ్లు, మధ్యాహ్నం 12 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమాల్లో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ రాజల్‌రావు, ఈఓ శ్రీనివాసరావు, అర్చకులు చక్రవర్తి శ్రీనివాసాచార్యులు, తిరువేంగళాచార్యులు, వరదరాజులు అయ్యంగార్, వెంకటాచార్యులు భక్తులు పాల్గొన్నారు.



మామిళ్లపల్లి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం చేపడుతున్న అర్చకులు

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

అడ్డాకుల: మండలంలోని కందూర్ శివారులో వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం శైవాగమ పండితులు పుల్లేటికుర్తి గణపతిశర్మ ఆధ్వర్యంలో శనివారం ప్రధాన ఆలయంలోని శివలింగానికి గవ్యాంత పూజలు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, నిత్యార్చన, నిత్యోపాసన, రుద్రహోమం, నిత్య బలిహరణ, నిరాజనమంత్ర పుష్పాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాన ఆలయంలోని శివలింగానికి అర్చకులు అభిషేకాలు చేశారు. అదేవిధంగా గౌరమ్మ ఆలయంలో అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ రాజేశ్వరశర్మ ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉండగా ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఆలయం వద్ద రథోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు ఈఓ తెలియజేశారు. కార్యక్రమంలో అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



కందూర్ ఆలయంలో శివలింగానికి పూజలు చేస్తున్న అర్చకులు

గంగాపురంలో కాముడి దహన వేడుకలు

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం గ్రామంలో ఒకరోజు ముందుగానే కాముడిదహన వేడుక నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఏటా వసంత త్రయోదశి రోజునే కాముడి దహన వేడుక నిర్వహిస్తారు. శనివారం రాత్రి గ్రామంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మేళతాళాలతో వడ్రంగి ఇంటికి చేరుకొని కాముడి బొమ్మను తీసుకొని గ్రామం మధ్యలో ఉన్న సేవా మండపం వరకు ఊరేగింపు నిర్వహించి.. అక్కడ పూజలు చేసి దహనం చేశారు. హోళీ పండుగ మాత్రం సోమవారం జరుపుకోనున్నారు.

నేడు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదివారం కామదహనం.. సోమవారం హోలీ వేడుకలు చేసుకోనున్నారు. పౌర్ణమి రోజున కాముడి దహనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ పర్యాయం ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో పౌర్ణమి ప్రారంభం కావడంతో కాముడిదహన వేడుకను ఆదివారం రాత్రి, సోమవారం హోలీ జరుపుకోనున్నారు. హోళి, కామదహనానికి సంబంధించి ఆధ్యాత్మికంగా అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. మన్మథుడు అనే కామదేవుడిని శివుడు అగ్నికి ఆహుతిచ్చిన రోజుగా వాడుకలో ఉంది. అయితే రతీదేవి ప్రార్థనకు చలించిన శివుడు కామదేవుడిని భౌతికంగా బతికించకుండా ప్రేమరూపంలో ప్రతి ఒక్కరి మనసులో ఉండేలా వరమిచ్చారని.. అందుకు చిహ్నంగా ఏటా వసంతకాలం పౌర్ణమి రోజున కామ దహనం చేస్తుంటారని పురాణాలు చెబుతున్నాయి. మరుసటి రోజు వసంత కాలంలో చెట్లు చిగురించినట్లుగా ప్రతి ఒక్కరిలో ప్రేమ చిగురించాలని రంగులతో వసంతోత్సవం నిర్వహిస్తున్నారు.



గంగాపురంలో కాముడి దహనం



జోగులాంబ సన్నిధిలో ప్రముఖులు



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాన్ని శనివారం ఎన్ఆర్ఐకి సంబంధించిన గ్లోబల్ ఎకనామిక్ అండ్ ట్రేడ్ బిజినెస్ కౌన్సిల్ సభ్యులు దర్శించుకున్నారు. ముందుగా వారు బ్రహ్మేశ్వర ఆలయంలోని బంగారు లింగానికి ఏకవార రుద్రాభిషేకాలు, జోగుళాంబ అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వారికి క్షేత్ర ప్రాశస్త్యాన్ని వివరించి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో హైద్రాబాద్‌కు చెందిన డాక్టర్ వినయ్‌కుమార్ రెడ్డి, కెనడాకు చెందిన శివకుమార్ వర్మ, కెనడాకు చెందిన డా.హుయ్, హైద్రాబాద్‌కు చెందిన మిథున్ కుమార్, జగదీష్ ఉన్నారు. ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని అన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో భక్తుల ప్రత్యేక పూజలు

మల్దకల్: స్థానిక స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రమేషాచారి, రవిచారి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. మరికొందరు భక్తులు స్వామివారికి దాసంగాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మల్దకల్, సద్దలోనిపల్లి ఆలయాలలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహులు, పద్మారెడ్డి, ఆలయ నిర్వాహకులు చంద్రశేఖర్‌రావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

చెరువులో నీటికుక్కల ప్రత్యక్షం

అమరచింత: పట్టణంలోని పెద్ద చెరువులో నీటికుక్కలు సంచరిస్తున్నాయి. చెరువులోని చేపలను తింటూ ఇక్కడే తిష్ఠ వేశాయని మత్స్యకారులు తెలిపారు. ఇప్పటి వరకు కనిపించని నీటి కుక్కలు చెరువులోని నీరు తగ్గుముఖం పట్టడంతో బయటకు వచ్చి తిరుగుతున్నాయి. జనాల చప్పుడు వినబడగానే అవి మళ్లీ నీటిలోకి వెళ్తున్నాయని జాలర్లు తెలిపారు. చెరువులో అధిక సంఖ్యలో నీటికుక్కలు చేరుకున్నాయని, తమ చేపలను తింటుండటంతో తమకు నష్టం వాటిల్లుతుందని, ఒంటరి సమయంలో అవి మనుషులపై దాడి చేస్తాయనే భయం కలుగుతుందని తెలిపారు.



అమరచింత పెద్ద చెరువులో నీటి కుక్కలు